తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## గరుడునిపై మలయప్ప దివ్యతేజం



తిరుమల,ఆగస్టు 11ప్రభాతవార్తప్రతినిధి:
పవిత్రమైన శ్రావణపౌర్ణమి సందర్భంగా నిండుపున్నమివెలుగుల్లో గురువారం రాత్రి రెండవసారి శ్రీమలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై సర్వాలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు.

## నంది వాహనంపై నీలకంఠుని దివ్యదర్శనం

శ్రీకాళహస్తి,ఆగస్టు 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలోని నీలకంఠేశ ్వరుని ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఆలయంలో భక్తుల తాకిడి అధికమైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. బుధవారం ఆలయంలో చక్కగా అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరుడు భక్తులకు నందివాహనంలో దర్శనమిచ్చారు. పలువురు భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.



# విద్యతోనే కుటుంబ పరిస్థితులు మెరుగు

## జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో డిప్యుటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:
పేదరికం నుండి బయత పడటానికి విద్య ఎంతో తోడ్పడుతుందని డిప్యుటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. జగనన్న విద్యా దీవెన 3వ త్రైమాసిక నగదు బదిలీ కార్యక్రమంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాపట్ల నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. జిల్లా స్థాయిలో చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంకు డిప్యుటీ సిఎం నారాయణస్వామి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిప్యుటీ సిఎం మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తల్లిదండ్రులకు పిల్లల విద్య ఆర్థిక భారం కాకుండా ఆ భారంను ప్రభుత్వమే భరించేలా కృషి చేస్తున్నారన్నారు. ఒక కుటుంబం ఎదగడానికి విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు అంకితభావంతో కృషి చేయాలన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన త్రైమాసిక కార్యక్రమం ద్వారా 11.02 లక్షల మంది విద్యార్థులకు 694 కోట్ల రూపాయలు జమ కానుందన్నారు. జిల్లాలో 41,384 మంది విద్యార్థులకు 23.78 కోట్ల రూపాయలు జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల వ్యక్తిగత బ్యాంకు అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు వుంటే అంత మందిని విద్యావంతులను చేయాలని సిఎం వారికి మేనమామగా వుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ కుటుంబ పరిస్థితులు మెరుగుపడాలంటే విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. సిఎం సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించి ఆ మేరకు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలలను అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఈ పథకం యొక్క లక్ష్యాలను అర్థం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పేదరికం నుండి తమ కుటుంబం ఆర్థికంగా ముందడుగు వేయడానికి విద్య తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని దీనిని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల విద్య పట్ల శ్రద్ధ వహించి వారు విద్యలో రాణించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రబ్బానీ భాషా ఇతర అధికారులు పాల్గొన్నారు.



జగనన్న విద్యాదీవెన త్రైమాసిక మెగా చెక్కును విద్యార్థుల తల్లులకు అందిస్తున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్‌లు

## జగనన్న విద్యా దీవెన తల్లుల ఖాతాల్లోకి జమ




తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 11 ప్రభాతవార్త ః
జగనన్న విద్యా దీవెన మూడవ త్రైమాసికానికి తల్లుల ఖతాల్లోకి రూ. 30.699 కోట్లు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బాపట్ల వేదిక నుంచి విద్యా దీవెన పథకం ద్వారా పేద విద్యార్థుల ఉన్నత చదువులు చదివించాలన్న లక్ష్యంతో 2022 ఏప్రిల్ జూన్ త్రైమాసికానికి సంబంధించి దాదాపు 11.02 లక్షల మంది విద్యార్థులకు రూ. 694 కోట్ల ఆర్థిక సహాయాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన మొదట విడత 45,333 మంది విద్యార్థులకు 24.56 కోట్లు, రెండవ విడత 45,070 విద్యార్థులకు 31.12 కోట్లు నేడు మూడవ విడతగా ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 46,131 మంది విద్యార్థులకు 41,142 మంది తల్లులు ఖాతాలకు సీఎం జగన్ 30.699 కోట్లు జమ చేశారు. ఎవరికైనా విద్యా దీవెన పథకం కింద లబ్ధి చేకూరలేదో వారి వివరాలను పరిశీలించి అర్హత మేరకు చర్యలు చేపడతామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా చెక్కును జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి చెన్నయ్య, వెనుకబడిన తరగతులు సంక్షేమ, సాధికార అధికారి యుగంధర్, వివిధ సంక్షేమ అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

## గజవాహనంపై పద్మావతీ అమ్మవారు విహారం



తిరుచానూరు,ఆగస్టు 11 ప్రభాతవార్త:
తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారు గురువారం రాత్రి గజవాహనంపై ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.రాత్రి సర్వాలంకార శోభితురాలైన శ్రీ పద్మావతీ దేవి గజవాహనాన్ని అధిరోహించి ఆలయ నాలుగు మాడవీధుల్లో సాక్షాత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లోకనాథం,ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి,సూపరింటెండెంట్లు శేషగిరి,మధుసూధన్, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ దాము తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో వినాయక చవితిని విజయవంతం చేద్దాం



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 11 ప్రభాతవార్త
వివిధ ప్రభుత్వ శాఖల యొక్క సమన్వయంతో వినాయక చవితి పండుగను, సామూహిక నిమజ్జన మహోత్సవాలను తిరుపతిలో విజయవంతం చేసుకుందామని సమన్వయ కమిటీ తీర్మానించింది. గురువారం తిరుపతి ఎమ్మెల్యేభూమన కరుణాకరరరెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ అధికారుల సమన్వయ కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తిరుపతి గణేశ ఉత్సవ కమిటి ప్రతినిధులు, నగర మేయర్ డాక్టర్ శిరీష, నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి, టిటిడి, పోలీసు, తుడ, ఎక్సైజ్, అగ్నిమాపకదళం, పర్యాటకశాఖ, విద్యుత్‌శాఖ, వైద్య ఆరోగ్య సమాచార తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు. తిరుపతి నగరానికి ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని ఆధ్యాతిక ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకుందామని, పర్యావరణహితమైన విగ్రహాలు ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని, రికార్డు డ్యాన్సులు, బాణాసంచా పూర్తిగా నిషేధిస్తూ పవిత్ర వాతావరణంలో పండగ చేసుకుందామని, అందుకు అవసరమైన సహాయ సహకారాలు, మరియు ఏర్పాట్లను ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కల్పించి విజయవంతం చేయాలని తీర్మానించారు.

## అమృత్ సరోవర్ పథకం గ్రామాలకు వరం

### జిల్లా కలెక్టర్



శ్రీకాళహస్తి రూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త
ప్రభుత్వం చేపట్టిన అమృత్‌సరోవర్ పథకం గ్రామాలకు వరమని చెరువుల అభివృద్ధికి గ్రామాల్లో చొరవ చూపి రైతు సంక్షేమానికి దోహదపడాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి పిలుపు నిచ్చారు.ఈ పథకానికి సంబంధించి ఆయన రైతులకు వివరిస్తూ అమృతంతో నీటిని పోలుస్తూ వర్షపు నీటిని వడిసి పట్టుకొని నిల్వ చేయటం ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. గురువారం ఏర్పేడు మండలం అముదూరు గ్రామంలో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అమృత్‌సరోవర్ పథకంతో చెరువులకు మహర్దశ వస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ ఇక్కడ రాగానే అజాదికా అమృత్ సరోవర్‌లో భాగంగా ప్రజలు,రైతులు, విద్యార్థులతో కలసి కలెక్టర్ చెరువుకట్టపై జాతీయ జెండాను నాటారు. మొదటి దశలో మండలానికి ఒక చెరువు చొప్పున జిల్లాలో 75 చెరువుల మరమ్మత్తులు లక్ష్యంగా చేపట్టామన్నారు. ధ్వామా పథక సంచాలకులు శ్రీనివాస ప్రసాద్, సహయ పథక సంచాలకులు పద్మశ్రీ, ఏపిఓ దేవరి, తాహసిల్దార్ ఉదయ్‌సంతోష్, ఎంపిడిఓ గిడయ్య, అముదూరు సర్పంచ్ పెరుమాళ్ ద్వామా సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ వారసత్వ సంపద కాపాడుకోవడం అందరి కర్తవ్యం

### - హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించిన కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:
దేశ వారసత్వ సంపద కాపాడుకోవడం అందరి కర్తవ్యమని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను కలెక్టర్ హరినారాయణన్ చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారా యణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు మాట్లా డుతూ ప్రధాని నరేంద్రమోడి ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుండి 15వ తేదీ వరకు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలను పురస్కరించుకొని ప్రతిరోజు ఒక కార్యక్రమం చేపడుతున్నామన్నారు. చిత్తూరు గాంధీ సర్కిల్ నుండి ప్రారంభమైన ఈ హెరిటేజ్ వాక్ నగరంలోని వీధుల గుండా పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు సాగింది. ఈ హెరిటేజ్ వాక్‌లో 500 మందికి పైగా విద్యార్థులు జాతీయ జెండా ఊపుకొంటూ వాక్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎఎస్పీ జగదీష్, ఆపరేషన్ ఎఎస్పీ కె.శ్రీనివాసరావు, చిత్తూరు నగర డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ డిఎస్పీ తిప్పేస్వామి, ఏఆర్ డిఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్‌ఐలు కె.నీల కంఠేశ్వర్‌రెడ్డి, మరళీ, మధు, నగర ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 25నుంచి త్రైమాసిక మెట్లోత్సవం

### బర్డ్ ఆస్పత్రిలో మరో వందపడకలు
### వాహనసేవలతోబాటు సంతృప్తికరంగా స్వామి దర్శనం
### "డయల్ యువర్ ఇఓ"లో ధర్మారెడ్డి



తిరుమల,ఆగస్టు 11ప్రభాతవార్తప్రతినిధి:
టిటిడి దాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి 27వతేదీ వరకు మూడురోజులు పాటు త్రైమాసిక మెట్లోత్సవం జరగనుంది. ప్రముఖ సామీజీలు విచ్చేసి భజనమండళ్ళకు అనుగ్రహభాషణం చేయనున్నారని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. ఈనెల 16వతేదీ నుంచి 20వరకు ఐదురోజులు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో శ్రీవేంకటేశ్వర వైభవోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. తిరుమల ఆలయంలో శ్రీవారికి జరిపించే సేవలన్నీటినీ ఐదురోజులు ఆక్కడి భక్తులకు తెలిసేలా నిర్వహించడం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఓ"కార్యక్రమం ముందు భక్తులతో కాసేపు ముచ్చటించారు. తిరుపతిలోని బర్డ్‌ఆస్పత్రిలో రోగులకోసం అదనంగా మరో వందపడకలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలలో గదులు పొందిన భక్తులకు ఏదేని సమస్యలు ఎదరైనా ఫిర్యాదుల రూపంలో తెలిసేలా చేసిన విధానాన్ని తిరుపతిలోననూ గదులకు అమలుచేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న సెప్టెంబర్ 27నుంచి జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తులు వాహనసేవలతోబాటు స్వామివారి దర్శనం ప్రశాంతంగా చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని ఇఓ తెలిపారు. భక్తులకు సంతృప్తికరంగా మూలమూర్తి దర్శనంతోబాటు వాహనసేవలు వీక్షించేలా చూస్తామన్నారు. అన్ని దర్శనాలు రద్దుచేసి పూర్తిగా సర్వదర్శనాన్ని అమలుచేయడం జరుగుతుందని ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలో ఉన్న గదుల్లో 35వేలమంది వరకు వసతి పొందవచ్చున్నారు. టిటిడిలో అజాదికా అమృతమహోత్సవం నిర్వహించేందుకు టిటిడి అనుబంధంలోని అన్ని ఉద్యోగులు, సిబ్బంది అజాదికా అమృత మహోత్సవంలో తమ ఇళ్ళపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఈనెల 15వతేదీ ఉదయం 11గంటలకు టిటిడి పరిపాలన భవనం వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ బాలమందిరంలో అనాధ పిల్లల ప్రవేశాల్లో నిబంధనలు సడలించి తల్లి లేక తండ్రి లేనివారిని కూడా చేర్చుకోవాలని వచ్చిన విజ్ఞప్తులను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్, రవాణా జిఎం శేషారెడ్డి, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, కేటరింగ్ అదికారి శాస్త్రి, వసతి కల్పన డిప్యూటీ ఇఓ భాస్కర్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, విజిఓ బాలిరెడ్డి, ఏపిఆర్ఓ నీలిమారావు తదితరులు పాల్గొన్నారు.

## 2024లో మరింత గొప్ప విజయం సాధిస్తాం

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సుగాలిమిట్టలో మంత్రికి హారతిపడుతున్న మహిళలు

పుంగనూరు,ఆగస్టు 11 ప్రభాతవార్త :
2024లో రానున్న అసెంబ్లీ ఎన్నికలలో 2019 ఫలితాల కంటే మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గిరి జన తాండాలలో గడపగడపకూ వైఎస్సార్ ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు మహిళలు హారతులతో సా ్వగతం పలికారు. సుగాలికుటుంబాల ప్రజలు నివసించే గ్రామాలలో ఆయన ఇంటింటికి పర్యటిస్తూ వారికి అందుతున్న పథకాలను,వారి సమస్యలింకేమైనా ఉన్నాయాని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలో అర్హతకల ప్రతి పేద కుటుంబాన్ని కూడా ఆదుకుని వారికి పలు సంక్షేమపథకాలను అందచేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని దేశంమొత్తం ఆంధ్రప్రదేశ్ పరిపాలనా సంస్కరణలనే చర్చింకుంటోందన్నారు. ఇపుడు ప్రజలు వారికి సంబంధించిన కార్యాలయాల పనుల నిమిత్తం మండలకేంద్రాలకు రాకుండానే సచివాలయాలలో పనులు పూర్తిచేసు కుంటున్నారన్నారు. సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రను తిరగరాశారన్నారు. గడపగడప కార్యక్రమంలో వారిండ్లకు వెడుతుంటే తమకు చేకూరిన లక్షలాది రూపాయల సాయంగురించి ప్రజలు వివరిస్తున్నారన్నారు. ప్రతి లబ్దిదారుని డబ్బు నేరుగా బ్యాంకులలో చేరుతోందని,ప్రజలు జగన్ పరిపాలన పట్ల ఎంతో సంతోషంతో ఉన్నారన్నారు.ప్రజా సహకారంతో వచ్చే ఎన్నికలలో అనూహ్యామైన మెజార్టీ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపి ఎన్ రెడ్డెప్ప,రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి, పికెఎం ఉడా ఛైర్మన్ నల్లబాల వెంకటరెడ్డియాదవ్,ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి,జడ్పీటిసి జ్ఞానప్రసన్నచంద్రారెడ్డి, జిల్లా ఎసీ ్ఎస్టీ కమిటీ సభ్యుడు మునేంద్ర నాయక్,ఆర్టీసి మజ్దూర్‌యూనియన్ ఛైర్మన్ జయరామిరెడ్డి,ఏఎంసి నాగరాజరెడ్డి,సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి,నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఆజాదికా అమృత్ మహోత్సవ్ " హెరిటేజ్ వాక్ "

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:



ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాణిపాకం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే గురువారం హెరిటేజ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే కాణిపాకంలోని చారిత్రక కట్టడాలు,ఆలయాలను శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు వరదరాజ స్వామి ఆలయం, మణికంఠేశ్వరాలయంలను చెత్తాచెదారంను తొలగించి శుద్ధి చేశారు. పెయింటింగ్, వ్యాస రచన పోటీలను నిర్వహించారు. అనంతరం కాణిపాకం ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, కార్యదర్శి సత్యంరెడ్డిలు మువ్వన్నెల జాతీయ జెండాలను పంపిణీ చేశారు. గ్రామంలో జాతీయ జెండాలను ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, పీడీ రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



కలియుగదైవం శ్రీవెంకటేశ్వరస్వామిని గురువారం చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల స ందర్భంగా వీరు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రామకుప్పం జడ్పీటిసి నితిన్‌రెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న పాల్గొన్నారు.

## ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి - ఆర్డీఓ శివయ్య

కుప్పంరూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త



ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండాను ప్రజలు ఎగరవేయాలని కుప్పం ఆర్డీఓ శివయ్య కోరారు. గురువారం చిత్తూరు నెహ్రూ యువతకేంద్రం, యువభారత్ అసోసియేషన్ అధ్వర్యంలో మండలంలోని కంగుందిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ర్యాలీని కంగుంది కోట వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 18 పుణ్యక్షేత్రాల్లో కంగుంది కోట, శివాలయం ఉండడం విశేషమన్నారు. నెహ్రూ యువకేంద్రం అధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ కంగుందిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్‌బాబు, యువ భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు వేకంత్ అనంతశయనం, మున్సిపల్ కౌన్సిలర్ సోమశేఖర్, మండల బిజెపి అధ్యక్షుడు వడివేలు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేష్, యువ కార్యకర్తలు బాలరాజు, శంకర్, వైస్ సర్పంచ్ తిరుపతి, ఎంఇఓ మహబూబ్ బాషా, ఎస్సై శివకుమార్, డిఆర్వో పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు పరిష్కరించాలి

దళిత నేతలు డిమాండ్

కుప్పంరూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త



కుప్పం మండలంలో దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ సురేష్‌బాబు అధ్యక్షతన మండలస్థాయి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా సమావేశానికి వచ్చిన కుప్పం మండల దళిత నేతలు కె.కన్నన్, పిజి సెల్వం, రవినాయక్, గణేష్ తదితరులు ఇతర మండలాల నాయకులు సమావేశానికి హాజరైతే మండల సమస్యలు ఎలా చర్చించాలని పేర్కొంటూ సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ దళిత కాలనీల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, వైస్‌ఛైర్మన్ మునస్వామి, ఎంపిడిఓ విజయదత్, ఎస్సై లక్ష్మిరెడ్డి, నేతలు దేవరాజ్, ప్రకాష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పు చేసుకోవాలి

సదుం,ఆగస్టు11ప్రభాతవార్త

ప్రధాన మంత్రి మాతృత్వ వందన కార్యక్రమంలోభాగంగా ప్రతి గర్భవతి ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పు చేసుకోవాలని చెరకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్‌అన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భవతి మూడు నెలల లోపు ఆరోగ్య కారక్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద నమోదుచేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించేరూ.5000 లు ఆర్థిక సాయం పొందవలెనన్నారు. క్రమంతప్పకుండాఆరోగ్యపరీక్షలుచేయించుకోవాలనిచెప్పారు.ఆరోగ్యపర్యవేక్షకసిబ్బందిఆరోగ్య ఆశాకార్య కర్తలు పాల్గొన్నారు.

## జాండ్లవారిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం

రొంపిచెర్ల,ఆగస్టు11ప్రభాతవార్త

మండల పరిదిలోని జాండ్లవారిపల్లె పంచాయతీలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 70 ఆవులకు, 30 దూడలకు పిరుదుల నివారణ మందునుపిచికారి చేశారు. ఆవులకు దూడలకు నులిపురుగుల నివారణమందును తాపించారు. 2869 గొర్రెలు,మేకలకు నీలి నాలుక వ్యాధికి టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాదికారి శ్రీధర్, సర్పంచి నాగిరెడ్డి, ఏహెచ్ఏలు సంపత్‌స్వామి, పునీత్, మోహిత్,రాజేష్, దాము, నంద తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రొంపిచెర్ల,ఆగస్టు11ప్రభాతవార్త

గర్భవతులు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ అన్నారు. గురువారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా వచ్చిన గర్భవతులకు రక్తపోటు, షుగర్, బరువు, గుండె పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి గర్భవతులకు పలుఅవగాహన కల్పించారు. తాజా ఆకు కూరలు, తాజా పండ్లు, కూరగాయలు, పండ్లరసాలు తీసుకోవాలని సూచించారు. ఎండు కర్జూరాలు,ద్రాక్ష,శనగ,నువ్వులు బెల్లంతో కలిపి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ,పీహెచ్ఎన్ పార్వతమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఎన్వీఆర్‌ట్రస్టు ఆపన్నహస్తం

పుంగనూరు,ఆగస్టు 11 ప్రభాతవార్త :



పట్టణంలోని తెలుగుతల్లి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వారికి ఎన్వీఆర్ ట్రస్టు గురువారం దుస్తులు,ఆహారం అందించింది. ట్రస్టు నిర్వాహకుడు వేణుగోపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కొత్త ఇండ్లులోని ఆశ్రమంలో వృద్దులకు ఉదయం మద్యాహ్నం,రాత్రి పూటలు ఆహారాన్ని ఉచితంగా అందచేశారు. ఆయన వారికి నూతన దుస్తులు అందేసి వారి వద్దనుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈసందర్భంగా చదళ్ళలోని శ్రీచౌడేశ్వరిదేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి శివకుమార్‌రెడ్డి,సభ్యులు నరేంద్ర,చిన్నా, విరూపాక్షి, బాబు,జయ,శంకర్,వెంకట్,భాస్కర,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయానికి ఆవు దూడ విరాళం

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు గురువారం ఆవు దూడను విరాళంగా అందజేశారు. పలమనేరుకు చెందిన మధర్ థెరిస్సా ఇన్సిస్ట్యూట్ అధినేత రవీంద్రబాబు అనే దాత సుమారు 60 వేల రూపాయలు విలువగల పుంగనూరు జాతి ఆవు దూడను విరాళంగా అందజేశారు. అలాగే వాటి పోషణ కోసం మరో రూ.20 వేలు అందజేశారు. ఆలయ ఈఓ ఎంవి.సురేష్‌బాబు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డిలకు అందజేశారు.

## తవణంపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుశీల బాధ్యతలు స్వీకరణ

తవణంపల్లె, ఆగస్టు 11 ప్రభాతవార్త:



తవణంపల్లె మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సుశీల గురువారం బాధ్యతలు స్వీకరించారు. తవణంపల్లె తహసీల్దార్‌గా పనిచేస్తున్న టీజీ.మోహనవళ్ళిని గత జూన్ 15న ఇక్కడ నుండి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుండి అప్పటి ఐరాల తహశీల్దార్ బెన్నురాజ్, కార్యాలయం డీటీ జయంతి తవణంపల్లె ఇన్‌చార్జి తహశీల్దార్‌లుగా పనిచేస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో జయంతి స్థానంలో ప్రస్తుత ఐరాల తహశీల్దార్‌ను తవణంపల్లె ఇన్‌చార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సుశీల గురువారం బాధ్యతలు స్వీకరించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యకు పేదరికం అడ్డుకారాదనేదే సిఎం జగనన్న ఆశయం

- ఎమ్మెల్సీ భరత్

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



విద్యకు పేదరికం అడ్డుకాకూడదనేది సిఎం జగనన్న ఆశయమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కాలేజ్‌లో జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా విద్యార్థులకు రూ 2.70 కోట్ల చెక్కును అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి ఉన్నత లక్ష్యాలకు ఎదగాలని సిఎం జగనన్న ఆకాంక్ష అన్నారు. అందుకే విద్యారంగంకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఓ పక్క పాఠశాలలను నాడు -నేడు పథకంలో బలోపేతం చేస్తూ మరో పక్క అమ్మఒడి, జగనన్న విద్య, వసతి దీవెన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగేలా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, కమీషనర్ రవిరెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, నేతలురాజ్‌కుమార్, జివి రమేష్, చందం సర్పంచ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి విద్యే మూలం

కార్వేటినగరం,ఆగస్టు 11 ప్రభాతవార్త:



దేశాభివృద్ధికి విద్యే మూలమని ఎంపిపి లతాబాలాజీ అన్నారు. కార్వేటినగరం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో జరిగిన జగనన్న విద్యాదీవెన కార్యాక్రమాన్ని ఎంఇఓ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఎంపిపి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించేందుకు జగనన్న విద్యాదీవెన అనే ఒక పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత సిఎం జగనన్నకే దక్కిందన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ఎంపిడిఓ చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ మండలంలో 12061మంది విద్యాదీవెన అందుకోనున్నారన్నారు. లబ్దిదారుల తల్లులు,విద్యార్థులచే సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాహశీల్దార్ అమర్‌నాథ్,జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ,మండల అధ్యక్షులు ధనంజయవర్మ,కో-ఆప్షన్‌మెంబరు పట్నం ప్రభాకర్,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల సేవలపై అవగాహన పెంచుకోవాలి

కార్వేటినగరం,ఆగస్టు 11 ప్రభాతవార్త:



ప్రభుత్వబ్యాంకుల సేవలపై కేంద్రప్రభుత్వ సామాజికభద్రత పథకాలలో అందరూ అవగాహన పెంచుకోవాలని కత్తెరపల్లె సప్తగి రిగ్రామీణబ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ వినీత్ తెలిపారు. గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అవార్డు కళాజాతబృందం సభ్యులు ప్రభు త్వం అందించే వివిధ పథకాలపై,ఇన్స్ రెన్స్ స్కీమ్‌లపై,బ్యాంకుసేవలపై కత్తెరపల్లెలో కళాజాతం నిర్వహించారు.కార్యక్రమంలో డ్వాక్రామహిళలు, గ్రామవాలంటీర్లు,బ్యాంకుసిబ్బంది,కళాజాతటీం సభ్యులు అవార్డు కళాబృందం సభ్యులు,గ్రామప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

సదుం,ఆగస్టు11ప్రభాతవార్త



ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం పని చేస్తోందని జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి అన్నారు. గురువారం మండలపరిధిలోని జోగివారి పల్లె, మార్తువారిపల్లె, కంభంవారిపల్లె, నాయని వారిపల్లె కోడకాడపల్లె, తదితర గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంపీపీ ఎల్లప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా పల్లెల్లో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎవరెవరికి ఎంత లబ్ది చేకూరింది అనే విషయాన్ని చదివివినిపించారు. అర్జీలు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి అనిత, సింగిల్ విండోఅధ్యక్షుడు తిమ్మారెడ్డి, సోమల మార్కెట్‌కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, నడిగడ్డ,బూరగమండల సర్పంచిలు, నారాయణరెడ్డి, వెంకటరమణ,బూరగమంద ఎంపీటీసీ మల్లికార్జున, వైకాపా నాయకులు నారాయణరెడ్డి ,ప్రకాష్‌రెడ్డి, రొడ్డారమేష్,పురుషోత్తంరెడ్డి ,పాపిరెడ్డి, ఎంపీడీఓ ఆదిశేషారెడ్డి,ఏపీఓ, ఏపీఎం, లైన్‌మెన్‌బాబు, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## ఆజాది అమృత మహోత్సవం హత్సోవం సందర్బగ రూట్ మార్స్

నిర్వహించిన అదికారులు

వెంకటగిరి ఆగస్టు 11 నప్రభాతవార్త



ఆజాది అమృత మహోత స్వం, మిషన్ అమృత సరోవర్‌లో భాగంగా గురువారం జంపు గ్రామచెరువులో ఉపాధి సిబ్బందితో కలిసి అధికారులు రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటిపై మూడు రోజుల పాటు జాతీయ జండాలను ఎగుర వేయాలని సూచించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య సమర యోధులను స్మరించాలని తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు.చెరువు కట్ట చుట్టూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం కిరణ్,ఎపిఓ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ప్రారంభం

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త



కోట మండలం వెంకన్నపాలెం గ్రామంలో గురువారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్య, తిరుపతి వైసీపీ పార్లమెంటరీ నియోజకవర్గం మైనార్టీ నాయకులు షేక్ మొబిన్‌బాషా, గూడూరు డివిజన్ యువ నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎంపీటీసీ రాజేశ్వరి, వైసీపీ నాయకులు శ్రీనివాసులు, మల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జండాలతో విద్యార్థుల ర్యాలీ

వెంకటగిరి ఆగస్టు 11 ప్రభాతవార్త



ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా ఎపిఆర్‌జెసి విద్యా ర్థులు గురువారం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.స్వాతం త్ర్యం వచ్చి 75 సంవత్సరాలైన సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సూచ నల మేరకు జండాలతో పట్టణ పురవీ ధుల్లో ర్యాలీ నిర్వహించడం, స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడం వంటివి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. దేశం కోసం ఎందరో మహానుబావులు ఆశువులు బాసినట్లు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధులను ప్రతిరోజు స్మరించు కోవాలని తెలిపారు. విద్యార్థులు కాలేజీ నుండి ర్యాలీగా బయలు దేరి పట్టణ పురవీధుల్లో ప్రదర్శన చేశారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త



విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోట సివిల్ కోర్టు న్యాయమూర్తి భరత్‌కమల్ పిలుపునిచ్చారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాలలో న్యాయచైతన్య విజ్ఞాన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, ఇతర అంశాలపై వివరించారు. చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య ఫలాలు మహనీయుల త్యాగం

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త



నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలు ఎందరో మహనీయుల త్యాగమని కోట మండల ఏపీవో విజయమ్మ అన్నారు. గురువారం మండలంలోని ఊనుగుంటపాలెం చెరువు వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రజలు బ్రిటీష్ పాలకుల వద్ద బానిసలుగా బతికారని, జాతిపిత మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధులు పోరాటం చేసి పరాయి పాలన నుంచి విముక్తి కల్పించారన్నారు. అమృత సరోవర్ పథకం కింద చెరువు పరిసర ప్రాంతాల్లో జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## వైసీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజీనామా

దొరవారిసత్రం, ఆగస్టు 11 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి రాజేంద్రప్రసాద్ గురువారం తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మండల పార్టీ కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డికి తన రాజీనామా లేఖను అందజేశారు. తన వ్యక్తిగత కారణాల వల్ల పదవికి రాజీనామా చేసినట్లు రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాజీనామా లేఖను అధిష్టానానికి అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

## సరోవర్ చెరువుల చెంత ఆజాదీకా అమృత్ మహోత్సవ్

కోట,ఆగస్టు 11 ప్రభాతవార్త



ఈ నెల 15వరకు అజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహించనున్నారు. కోట మండలంలోని ఊనుగుంటపాళెం పాత చెరువును రూ 9.87 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎపిఓ విజయమ్మ మాట్లాడుతూ గురువారం ప్రజా ప్రతినిధులతో ఉపాధి కూలీలతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు.శుక్రవారం ప్రముఖుల సందేశాలు ఫోటో ప్రదర్శన,శనివారం విద్యార్థులతో దేశ భక్తి గీతాలాపన,ఆదివారం జలహారతి, 15న చెరువుల వద్ద జాతీయ పతాకాన్ని స్వాతంత్ర్య సమరయోధుల, సీనియర్ సిటిజన్స్ మాజీ సైనికులతో ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధంచి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని, ఉత్సవాలను కనుల పండుగగా నిర్వహిస్తామని విజయమ్మ తెలిపారు.

## ప్రతిరైతు ఈక్రాప్ నమోదుచేసుకోవాలి : ఏఓ



నాయుడుపేట రూరల్ 11 ప్రభాతవార్త

గ్రామాల్లో పంటలు సాగుచేసే ప్రతిరైతు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం పుదూరులో వ్యవసాయ సహాయకులు వరిపంట సాగుచేపట్టిన రైతుల పొలాలకు ఈక్రాప్ నమోదుచేయడం జరిగింది. ఈసందర్భంగా వ్యవసాయాధికారి గణేష్ మాట్లడుతూ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో వ్యవసాయసాగు చేపట్టిన రైతుల పొలాల్లో ఈక్రాప్ నమోదు చేస్తున్నామన్నారు.ప్రతిరైతు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.నాయుడుపేట మండలంలో 1496హెక్టార్లులో వరిపంట, 16హెక్టార్లులో పత్తి,11హెక్టార్లులో వేరుశనగ పంటలను రైతులు సాగుచేపడుతున్నారని తెలిపారు.ఖరీఫ్ సీజన్ నుండి వ్యవసాయశాఖ,రెవెన్యూ శాఖలు కలిసి జాయింట్ అజమాయిషి పద్దతిలో పంటలను నమోదు చేయడం జరుగుతుందన్నారు.పంటలను ఈక్రాప్ నమోదు చేసుకోవడం ద్వార ప్రకృతి వైపరిత్యాలు సంబవించినప్పుడు జరిగే నష్టాన్ని అంచనా వేయడం,జరిగిన నష్టానికి ఇచ్చే ఇన్‌పుట్ సబ్సీడీలు,పంటల బీమా మొదలగునవి పొందాలంటే పంటలను ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట గ్రామవ్యవసాయ సహాయకులు,రైతులు,తదితరులు ఉన్నారు.

## ఎన్టీఆర్ తనయ ఉమామహేశ్వరి పేరిట అన్నదానం

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



తెదేపా వ్యవస్థాపకులు దివంగత ఎన్టీఆర్ కుమార్తె ఇటీవల మృతి చెందిన కంఠమనేని ఉమామహేశ్వరి జ్ఞాపకార్థం కుప్పంలో గురువారం తెదేపా నేతలు అన్నదానం జరిపారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్న క్యాంటీన్ ద్వారా సుమారు ఐదువందల మందికి అన్నదానం చేశారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, శాంతిపురం అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, రామకుప్పం అధ్యక్షుడు ఆనందరెడ్డి, నేతలు శరవణ, ఉదయ్‌కుమార్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు జాతీయ జెండాల పంపిణీ

శాంతిపురం, ఆగస్టు11 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీలకు జాతీయ జెండాలను గురువారం మండల కార్యాలయంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, ఎంపిడిఓ హేమ మాలిని పంపిణీ చేశారు. మండలానికి 8447 జాతీయ పతాకాలు మండలానికి అందగా ప్రతి ఇంటా జెండా ఎగురవేయాలని నేతలు కోరారు. కార్యక్రమంలో నేతలు దండపాణి, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రామకుప్పంలో ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

రామకుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం 40వ ఆవిర్భావ దినోత్సవంను పురస్కరించుకుని రామకుప్పంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్య దర్శి రఘుపతిరెడ్డి మాట్లాడుతూ ఉపా ధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ అనేక పోరా టాలు, ఉద్యమాలు చేసిందన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలుపాల్‌దేవ్, సూర్యప్రకాష్,సాయిగిరీష్,గిరి,మగేష్, పురుషోత్తం, శివరాజగన్, గజేంద్ర, మోహన్‌రావు, రాజవేలు, బాబు, సుబ్రమణ్యం, రమేష్, హెచ్ఎం పరశురాంనాయుడు, అన్సర్ బాషా పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్సీ

రామకుప్పం, ఆగస్టు11 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే సిఎం జగనన్న ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. గురువారం పిఎంకె తాండాలో ఎమ్మెల్సీ గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. 2024లో మరలా సిఎంగా జగనన్న ఎన్నికవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు బావాజీ నాయక్, రాం బాబురెడ్డి, ఎంపిటిసి నాగభూషణం, నేతలు చెంగారెడ్డి, కేశవరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ అన్నమయ్య ఎంటర్‌ప్రైజెస్ టైల్స్ షోరూం ప్రారంభం

తిరుపతి నగరం, ఆగష్టు 11 ప్రభాతవార్త

స్థానిక బైరాగిపట్టెడలో శ్రీ అన్నమయ్య ఎంటర్‌ప్రైజెస్ టైల్స్ షోరూంను యజమాని శివారెడ్డి ప్రారంభించారు. శివారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా టైల్స్, గ్రానైట్, మార్బుల్స్ రంగంలో విశేష అనుభవం కలిగి ఉండడంతో పాటు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అతి తక్కువ ధరలకే మార్బుల్స్, గ్రానైట్స్, టైల్స్‌ను అందిస్తున్నామన్నారు. సఫారీ, మెట్రో, క్యాపిటల్, తదితర కంపెనీలకు సంబంధించి అన్ని రకాల టైల్స్‌ను హోల్‌సేల్స్‌గా ధరలకే హోల్‌సేల్ ధరలకే ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తిరుపతి, చుట్టు ప్రక్కల ప్రజలు, కష్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని శివారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కస్టమర్లు, ప్రజలు, సతీమణి లలితమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అండ

**- డిప్యూటీ సిఎం నారాయణస్వామి**



చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళ ఆర్థికంగా ముందడుగు వేయాలని డిప్యూటీ సిఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశభవనంలో గురువారం డిప్యూటీ సిఎం నారాయణస్వామి డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీతో కలిసి జిడి నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల ఏరియా కో-ఆర్డినేటర్లు, ఎపిఎంలు, సిసిలు, సంఘమిత్రలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వం ఏ సంక్షేమ కార్యక్రమం అమలు చేసినా మహిళల పేరిటే అమలు చేస్తుందన్నారు. డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు కార్యక్రమంలో వైఎస్‌ఆర్ చేయూత రెండు విడతల్లో 324.64 కోట్ల రూపాయలతో మహిళలకు జీవనోపాధులు కల్పించడం జరిగిందన్నారు. వైఎస్‌ఆర్ అసరా కింద 29,300 సంఘాలకు రెండు విడతల్లో 568.51 కోట్ల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు.

# ఎందరో త్యాగ ఫలితం - మన స్వాతంత్ర్యం భారతదేశం



రేణిగుంట, ఆగస్టు 11 ప్రభాతవార్త: ఎంతో మంది దేశ భక్తుల త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఫలమని ఎంపీడీవో హరిబాబు, సర్పంచ్ నాగేషం సంయుక్తంగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా గురువారం రేణిగుంట పట్టణంలో ర్యాలీ జరిగింది. స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా బజారు సెంటర్‌లో గాంధీ విగ్రహాన్ని దాటుకుని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న కస్తూరిబా సమేత మహాత్మాగాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, బాల బాలికలు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొని చేత జాతీయ పతాకాలు పట్టుకుని మేరా భారత్ మహాన్, భారత్ మాతాకి జై, అని నినాదాలు చేసుకుంటూ ర్యాలీలో పాల్గొన్నారు. హరిబాబు, నాగేషం మాట్లాడుతూ వచ్చిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయకుండా దేశం గర్వపడే విధంగా అందరూ జీవించాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో ఎంపీడీవో హరిబాబు, సర్పంచ్ నాగేశం, వైస్ ఎంపీపీ సుజాత, కార్యదర్శి విజయభాస్కర్, మండల కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, వార్డు మెంబర్లు రసూల్, ఈశ్వరి, ఇన్బానాథన్, వైకాపా నేతలు హసన్, వెంకటేశ్వరులు, సీపీఎం పార్టీ నేత ఓ.వి.రమణ, ఇరు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శ్రీ మిత్రలో పెన్‌డౌన్

కోట,ఆగస్టు 11 ప్రభాతవార్త : సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య శ్రీ మిత్రల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా పెన్ డౌన్ చేశారు. ఈమేరకు కోట నుంచి నెల్లూరు. ఆటు తిరుపతి కేంద్రాలల్లోని డిఎంహెచ్ఒ కార్యలయాల్లో ఎదుట ఆందోళన చేపట్టారు.అక్కడ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంలో చేపట్టే వైద్య సంక్షేమ కార్యక్రమాల్లో ఆరోగ్య శ్రీ కీలక పాత్ర పోషిస్తుందని, అందులో పని చేసే ఉద్యోగులకు భద్రత లేకుండా పొయిందన్నారు. ఒక వైపు ప్రభుత్వ ఉద్యోగలమంటూ.. మరో వైపు చాల చాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.13 వేల జీతం ప్రస్తుత పరిస్థితుల్లో ఏలా పరిపోతుందని భాధితులు ప్రశ్నించారు. సంక్షేమ పథకాలును సైతం దూరం చేస్తున్నారని వాపోయారు.

## దేశ భక్తుల అడుగుజాడల్లో నడవాలి : ఎటిఎస్



శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి స్వాతంత్ర్య సముపార్జనకు పాటుపడిన దేశ భక్తుల అడుగుజాడల్లో నడవాలని వారిని ఆదర్శంగా చేసుకొని మసలుకోవాలని శ్రీకాళహస్తీశ్వరాలయ దర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. గురువారం ఎబివిపి సారథ్యంలో పట్టణంలో ఆజాదికా అమృత్ కార్యక్రమాలను వేలాది మంది విద్యార్థులతో ఏర్పాటు చేసారు.పట్టణ నడిబొడ్డులోని వీరకాకాని స్క్వేర్ (పెండ్లి మండపం) నుంచి 50అడుగుల జాతీయ జెండాను భారీగా ఊరేగించారు. నాలుగుమాడావీధుల్లో ర్యాలి నిర్వహించారు. ముఖ్యఅతిదిగా దేవస్థానం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొని భారత్‌మాతకే జై, వందేమాతరం అంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకుసాగారు. విద్యార్థుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ తమ భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కంఠాఉదయ్‌కుమార్, గరికపాటి రమేష్‌బాబు, ఎబివిపి విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుచ్చిపై తిరుమాడ వీధులలో భక్తులకు దర్శనం



చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారు గురు వారం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా స్వామి వారిని ఆలయ అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనాధి నిత్యకైంక ర్యాలను ఆగమోక్తంగా జరిపించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ చేసి తిరుమాడ వీధు లలో ఊరేగించారు. సూపరింటెండెంట్ దాసరి రమణయ్య, అర్చకులు ఆంజనేయచార్యులు, రవిచంద్రన్, పరిచారకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనాలకు సహకరించండి

**-ఎస్పీకి వినాయక కమిటీ వినతి**



తిరుపతి, ఆగస్టు 11ప్రభాతవార్త: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఈనెల 31న జరగనున్న వినాయకచవితి పర్వదినం. ఆ తరువాత సెప్టెంబర్ 4ఆదివారం చేపట్టే విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరుపుకునేలా చూడాలని వినాయక మహోత్సవ కమిటీ కోరింది. ఈ రెండు కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కునేలా నగరంలో పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన ఏర్పాట్లు, చర్యలు తదితర వాటిపై గురువారం ఉదయం తిరుపతి ఎస్పి పి.పరమేశ్వరరెడ్డిని కమిటీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, ఆర్‌సి మునికృష్ణ, గోపీప్రసాద్, భాస్కర్ నాయుడు, చెంగారెడ్డి, వాసు,గుండాల గోపీనాథరెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, కరాటే శ్రీను తదితరులు కలిశారు. నగరంలో గత వినాయకచవితి పర్వదినం అనుభవాలు, ప్రశాంత నిమజ్జనం తదితర వాటితరహాలోనే ఈ ఏడాది జరుపుకునేలా సహకారం అందించాలని కోరారు.

# ఆకట్టుకున్న భక్తుల విన్యాసాలు

## స్వామి, అమ్మవారి దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే





నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త : మండల కేంద్ర ంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజులస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవరోజు గురువారం ఉదయం స్థానికంగా మొక్కుబడి కలిగిన భక్తులు శరీరం వెనుకవైపు ముళ్ల గుచ్చుకోని క్రేన్, జెసిబి, లారీలు, ట్రాక్టర్, ఆటోలను లాగడం, వ్రేలాడడం భక్తులను మరింతంగా ఆకట్టుకుంది. ప్రతిఏడాది వన్నిరెడ్డి కులానికి చెందిన యువకులు మొక్కుబడితో ఈ విన్యాసాలను చేయడం ఆనవాయితీగా వస్తున్నది. సాయంత్రం అమ్మవారు, ధర్మరాజులస్వామివారిని సర్వభూపాల వాహనంపై అధిరోహించి నారాయణవనం, సముదాయం గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు వన్నిరెడ్డి కులస్థుల పెద్దల ఆధ్వర్యంలో భారీ పూలమాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారిని, స్వామివారిని పుష్పాలతో సుమనోహరంగా అలంకరించిన తర్వాత పురవీధుల్లో ఊరేగించారు. అంతకుముందు ఉదయం సముదాయం గ్రామంలో స్వామి,అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త టిఎస్.సొరకాయులురెడ్డి, మాజీ ధర్మకర్త దేశప్పరెడ్డి, వన్నిరెడ్డి కులపెద్దలు కెఎస్.రవిరెడ్డి, గోపిరెడ్డి, శరవణ, సొరకాయులు, టి.శ్రీరాములురెడ్డి, సముదాయం గ్రామస్తులు, ఉభయదారులు పాల్గొన్నారు.

**ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే :**

నారాయణవనంలో జరుగుతున్న ద్రౌపతీదేవి సమేత ధర్మరాజుల స్వామి వారి ఉత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్సియల్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## తెలుగుదేశంతోనే బిసిలకు గుర్తింపు

**బిసిల ఆత్మీయ సమావేశంలో పలువురు వక్తలు**



శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు బిసిలకు గుర్తింపు ఉండేది కాదని ఎన్‌టిఆర్ అధికారం చేపట్టిన తరువాత బిసి సామాజిక వర్గం ప్రధాన్యతను గుర్తించి వారికి చదువు ల్లోనూ, సామాజికంగా, ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయంగా గుర్తింపు తెచ్చిన ఘనత దక్కిం చుకున్నారని గురువారం జరిగిన బిసిల ఆత్మీయ సమావేశంలో పలువురు వక్తలు వివరించారు. బిసి సెల్ అధ్యక్షులు పోలూరు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు కన్నవరం హరిబాబు సారధ్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో బిసిలకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎనలేని గుర్తింపు ఇచ్చారని వివరించారు.ఆయన వారసుడుగా బొజ్జల సుధీర్‌రెడ్డి నేడు అన్ని వర్గాల వారితో సమన్వయంతో ముందుకు వెళుతున్నారని ఏ కార్యకర్తలకు ఏ బాధ వచ్చినా తానున్నానని ముందుంటున్నారని వివరించారు. నేడు సామాన్యుడు కూడా రాజకీయ విశ్లేషణ చేస్తున్నారంటే నాడు ఎన్‌టిఆర్ వారికి ఇచ్చిన గుర్తింపే అన్నారు. పార్టీలో నేడు చంద్రబాబునాయుడు బిసిలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిసి నాయకులు గుమ్మడిపూడి దశరథాచ్చారి, రెడ్డి వారి గురువారెడ్డి, పట్టణ బిసి సెల్ అధ్యక్షుడు పోలూరు శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నవరం హరిబాబు, రేణుకాదేవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి,కెవి ప్రతాప్‌రెడ్డి, నెమ్మికూరు బుజ్జి, ఎంఎస్‌రెడ్డి, రాచేటి సుబ్రమణ్యం, దొరైరాజ్‌రెడ్డి, మునిరాజయాదవ్, ఢిల్లిబాబు గాండ్ల గోవిందయ్య, బాలసుబ్బయ్య, దుర్గ, సుజాత, మురళీరెడ్డి, యాదగిరి, మణి, గంగిరెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ గుప్తా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొందరగా వంతెన నిర్మాణం పూర్తి చేయండి:మంత్రి



సదుం ఆగస్టు11ప్రభాతవార్త : రెండేళ్ల క్రితం వర్షాలకు కొట్టుకు పోయిన గార్గేయనదిపైనున్న వంతెన ప్రాంతంలో కొత్తగా వంతెన నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణ పనులను గురు వారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వంతెన నిర్మాణ పనులు వర్షాలు వచ్చేలోపు పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం యర్రాతివారిపల్లె అయ్యప్ప స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ధ్వజస్థంభం బంగారుతాపడం పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, దృశ్య, హస్తకళలరాష్ట్ర చైర్మెన్ కొండవీటి నాగబూషణం,ఊటుపల్లె సర్పంచి శ్రీనివాసులురెడ్డి,తాటిగుంటపాలెం ఉపసర్పంచి రామచంద్రయ్య,ఆలయ మేనేజరు భాస్కరరాజు, యండపల్లె మనోహరరెడ్డి, సీఐ మధుసూధనరెడ్డి, ఎస్సైలు మారుతి, లక్ష్మీకాంత్‌లు పాల్గొన్నారు.

## కార్వేటినగరంలో వేణుగోపాలస్వామి ఊరేగింపు



కార్వేటినగరం,ఆగస్టు 11 ప్రభాతవార్త: తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న శ్రీరుక్మిణ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ంలో స్వామివార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ కిశోర్,సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో గుజరాత్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్



కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త: గుజరాత్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ జస్టిస్ అరవింద్ కుమార్ గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకు న్నారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఐరాల తహశీల్దార్ సుశీల, సూపరెండెంట్ కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌వీఎస్ ఆస్పత్రి ప్రారంభించిన డాక్టర్ శిరిషా



తిరుపతి నగరం, ఆగస్టు 11 ప్రభాతవార్త : స్థానిక రాజన్న పార్కు, ఓల్డ్ మెటర్నటీ ఆస్పత్రిరోడ్డులో ఎస్‌వీఎస్ ఆస్పత్రిని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ప్రమీలా ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎస్ బాలకృష్ణరాజు, స్వర్ణ ఈఎన్‌టీ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఎస్. హరినాథ్, ఎస్వీ చిల్డ్రన్స్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఆర్ముగం, హర్షిత ఆస్పత్రి అధినేత డాక్టర్ పార్థసారధిరెడ్డి, పలువురు ప్రముఖులు హాజరై మాట్లాడారు. అంతకు ముందు ఎస్‌వీఎస్ ఆస్పత్రి అధినేత, జనరల్ ఫిజిషియన్, షుగర్ వ్యాధి నిపుణులు, ఐసీయూ , కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఆర్. రాఘు రాములు, అనస్తీసీయాటిస్ట్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎం.జె.కె. సౌజన్య మాట్లాడుతూ ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో షుగర్, థైరాయిడ్, బీపీ, అన్ని రకాల విషజ్వరాలతో పాటు ఐసీయూ, గుండె వ్యాధులు, క్రిటికల్ కేర్ 24/7 రోజులు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. తిరుపతి జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. నూతన ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై వారి ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన కీచకవధ



రామచంద్రాపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త: ఎన్ఆర్ కమ్మపల్లిలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలలో భాగంగా కీచకవధ హరికథ ప్రేక్షకులను అలరించింది. పూజారి హరి ఆచ్చారి ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి హరికథా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అజ్ఞాతవాస సమయంలో పాండవులు మారువేషంలో విరాట్ రాజు కొలువులో చేరడం, అక్కడ మాలినీ పేరుతో ద్రౌపది విరాట్ రాజు అర్ధాంగి సుదేష్ణదేవి వద్ద పనికి చేరడం, సుదేష్ణదేవి తమ్ముడు కీచకుడు మాలినీని చెరపట్టడం భీముడు నర్తనశాలలో కీచకుడిని వధించడం వంటి ఘట్టాలను హరికథ భాగవతారిణి మునిలక్ష్మి ప్రేక్షకులకు కన్నులకు కట్టినట్లు వర్ణించారు. శ్రీవెంకటేశ్వర నాట్యకళామండలి వారిచే రాత్రి నాటక ప్రదర్శన ప్రేక్షకులను అబ్బురపరచాయి.

## పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు అమలు : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కార్యదర్శి భాస్కర్, ఇఎన్‌సి సుబ్బారెడ్డిలు గురువారం కలెక్టర్లతో అమరావతి నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు నుండి కలెక్టర్ హరినారాయణన్, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పిడి చంద్రశేఖర్, డిపిఒ లక్ష్మీ తదితరులు హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ గత వారం నుండి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 37 మేజర్ గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పథకం పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణాలను వేగవంతం చేయడానికి జిల్లా స్థాయి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించాలన్నారు.

## రాష్ట్ర స్థాయి జూడోపోటీలు

తిరుపతి(విద్య), ఆగస్టు 11 ప్రభాతవార్త: తిరుపతిలో ఏపీ జూడో అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి పర్యవేక్షణలో ఏపీ సీనియర్ జూడో టీం స్టేట్ సెలెక్షన్స్ మెన్, ఉమెన్ 2022-23 తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని జిల్లా జూడో కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. ఎంపికైన రాష్ట్ర జూడో జట్టు ఈ నెల 16 నుంచి 20 వరకు లక్నో, ఉత్తరప్రదేశ్‌లో జరుగు జాతీయ సీనియర్ జూడో ఛాంపియన్‌షిప్ మెన్, ఉమెన్ 2022-23లో పాల్గొంటుందని జిల్లా గౌరవాధ్యక్షులు రాజేష్ అన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో గురువారం సత్య నారాయణ వ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనం గా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. అలాగే స్వామి, అమ్మవార్లకు గరుడసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో జాతీయ జెండా ఆవిష్కరణ

గుడుపల్లె, ఆగస్టు 11 ప్రభాతవార్త : ద్రవిడ వర్సిటీ పరిపాలన భవనంపై గురువారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున జరుపుతోందని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ అక్యుటర్ బాబు, డిఇఇ అనిల్‌కుమార్‌రెడ్డి, కరీముల్లాలు పాల్గొన్నారు.

## రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు



నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త : పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలంలో గురువారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ చిత్తూరుకండ్రిగ మలుపు వద్ద తిరుపతి నుండి చెన్నైకి వెలుతున్న ఆర్టీసీ లగ్జరీ బస్సును చెన్నై సైదాపేట నుండి తిరుమలకు వెలుతున్న మారుతీ ఓమిని ఉదయం 8.15గంటల ప్రాంతంలో ఎదురుగా వెళ్లి ఢీకొన్నది. ఈ ప్రమాదంలో సైదాపేటకు చెందిన వెట్రీవేలన్(37), కె నారాయణ(40) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పుత్తూరు ప్రభుత్వ ఆస ్పత్రికి ప్రధమ చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి తిరుపతి రుయాకు మెరుగైనా వైద్యం కోసం పోలీసులు తరలించారు. సాయంత్రం 4.30గంటలకు వెత్తలతడుకు సమీపంలోని తాస జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద పాలమంగళం వైపు వెళుతున్న షేర్ ఆటోను మోటారుసైకిలిస్టు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెదురుకుప్పం మండలం ఎర్రగుండ్లపల్లికి చెందిన కె గురుమూర్తి(35), పిచ్చాటూరు మండలం రామగిరికి చెందిన పి సురేష్(27 తీవ్రంగా గాయపడ్డారు. ఆటోలో వెలుతున్న తుంబూరు గ్రామస్తులు కుప్పమ్మ, అమరావతి, గిరిబాబులకు గాయాలయ్యాయి. నింద్ర 108 సిబ్బంది ప్రశాంత్, లెనిన్‌లు పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో కొంతమందిని మెరుగైనా వైద్యంకోసం తిరుపతి రుయాకు ఎస్ఐ పరమేష్ నాయక్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో ఘనంగా శ్రవణం ఉత్సవం

నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం గురువారం శ్రవణం ఉత్సవంతో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు.

# సీఎం గారూ... ఆరోగ్య మిత్రాలపై దయచూపండి...!

**- సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన - ఆరోగ్యశ్రీ జిల్లా ప్రతినిధులకు వినతి**

తిరుపతి నగరం, ఆగస్టు 11 ప్రభాతవార్త : సీఎం జగన్మోహన్‌రెడ్డి గారూ...ఆరోగ్య మిత్రాలపై కాస్త దయచూపి సమస్యలు పరిష్కరించండి సారూ అని ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆరోగ్యమిత్ర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక రోజు తిరుపతి ఆరోగ్యశ్రీ కార్యాలయాల ఎదుట గాంధేయ మార్గంలో సంఘం ప్రతినిధులు, ఆరోగ్య మిత్రాలు, సిబ్బంది నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శి ప్రభావతి, అధ్యక్షులు లత, వైస్ ప్రెసిడెంట్ సిద్దయ్య, సెక్రటరీ ఉషారాణి, జాయింట్ సెక్రటరీ కవిత, ట్రెజరర్స్ శ్రీనివాస్, విశ్వనాథ్‌బాబు, జిల్లా మేనేజర్ శివకుమార్ మాట్లాడుతూ మాజీ సీఎం స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గత 16 సంవత్సరాలుగా ఒకే జీతంతో పనిచేస్తూ ప్రజా సేవలో నిరంతరం యుద్ధసైనికుల్లా పోరాడుతున్నామన్నారు. కాని ఇంత వరకు ఏ ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఆరోగ్య మిత్ర, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు చిరు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్య మిత్రా, సిబ్బందికి న్యాయం జరుగుతుందని నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆరోగ్యశ్రీ మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, చిత్తూరు జిల్లా మేనేజర్, టీమ్ లీడర్లు, ఆఫీస్ అసోసియేట్‌లు, ఆరోగ్య మిత్రాలు, సిబ్బంది పాల్గొన్నారు.

